వరిసాగుకే రైతుల మొగ్గు

- ఆయకట్టులో పెరుగుతున్న యాసంగి సాగువిస్తీర్ణం
- నారుమడులు సిద్ధం చేసిన రైతులు
- పత్తి పంటను తొలగించి పొలాలుగా మారుస్తున్న అన్నదాతలు

గుర్రంపోడు : ఏఎమ్మార్పీ ఆయకట్టులో వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుంది. మండలంలో యాసంగిలో వానాకాలం మించి వరిసాగు జరగనున్నట్లు అధికారులు అంచనా. నెల రోజులుగా జరుగుతున్న యాసంగి వరినాట్లు ఈ నెలాఖరు వరకు వేయనున్నారు. గతంలో నీటి ఎద్దడితో యాసంగిలో ముందుగానే నాట్లు వేసేవారు. ఈ ఏడు ఏఎమ్మార్పీ ఆయకట్టులో నిరంతరాయంగా నీరువస్తుండడంతో పాటు, వారబందీ విధానం లేకపోవడంతో మండలంలోని ఆయకట్టు పరిధిలో వరినాట్లు ఊపందుకుంటున్నాయి.

పెరిగిన కొత్త ఆయకట్టు..

ఆయకట్టులో గత వానాకాలంతో పోలిస్తే ఈ యాసంగి వరిసాగు విస్తీర్ణం గణనీయంగా పెరగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది రెండు పంటలకు నీటి విడుదల లేకపోవడంతో వానాకాలంలో సాగుపై అనుమానాలతో ఉన్న రైతులకు చివరి సమయంలో పూర్తిస్థాయిలో సాగర్ నిండి నీటి విడుదల చేశారు. అయినా సాధారణ స్థాయిలో 12వేల ఎకరాల్లో సాగుజరిగింది. ఈ యాసంగి సీజన్‌కు నీరు పుష్కలంగా ఉండడంతో మండలంలో ఈసారి 16వేల ఎకరాలకు పైగా సాగు జరగనున్నట్లు అంచనా. ఇందుకు రైతులు పత్తి కట్టెను తొలగించి కొత్తగా వరిసాగుకు భూములను సిద్ధం చేస్తున్నారని అధికారులు చెబుతున్నారు.


కొత్త ఆయకట్టులో దమ్ముచేసిన పొలాలు


నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్న వరినారు

గతంలో వద్దన్నా వరిసాగు వైపే..

గతంలో వరికంటే లాభదాయక ఆరుతడి పంటలనే యాసంగిలో సాగు చేసుకోవాలని ప్రభుత్వం ప్రచారం చేసేది. వరికి ఇప్పుడున్న మద్దతు ధర లేకపోవడం, వారబంధీ విధానంతో సరిపడా నీరు అందించలేమని అధికారులు ఆరుతడి పంటలను ప్రొత్సహించేవారు. ప్రస్తుతం పరిస్థితులు భిన్నంగా ఉండడంతో వరిసాగుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడం, సన్నరకాన్ని సైతం కొనుగోలు చేయడం, గతంతో పోలిస్తే ధాన్యం కొనుగోళ్లలో పెద్దగా సమస్యలు లేకపోవడం, బోనస్ కూడా లభిస్తుండడంతో రైతులు వరిసాగు లాభదాయకంగానే భావిస్తున్నారు. తక్కువ శ్రమతో నికరాదాయం వరిసాగు ద్వారా పొందవచ్చునని రైతులు భావిస్తున్నారు. ముదురు బత్తాయి తోటలను తొలగించిన రైతులు మళ్లీ బత్తాయి మొక్కలు నాటకుండా వరిసాగుకే సిద్ధమవుతున్నారు. ఈ ప్రాంతంలో గతంతో పోలిస్తే వరితో పాటు వేరుశనగ, మిర్చి పంటల సాగు కూడా యాసంగిలో పెరిగింది. ఏఎమ్మార్పీ నీటితో పాటు చెరువులు, కుంటలు నిండి భూగర్భజలాలు పెరగడంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.

పత్తి కట్టె తొలగించి వరిపంట వేస్తున్నా



ఏఎమ్మార్పీ నీటితో చెరువులు, కుంటలు నిండడంతో తక్కువ శ్రమతో వరిలో నికరాదాయం వస్తుందని ఈ ప్రాంతలో చాలా మంది కొత్త ఆయకట్టును సిద్ధం చేసి వరిసాగు చేస్తున్నారు. నేను కూడా పత్తి కట్టెను తొలగించి యాసంగిలో అదనంగా రెండెకరాల వరి సాగు చేశా. గతంలో కంటే ప్రస్తుతం మద్దతు ధర, బోనస్‌లు కల్పిస్తుండడంతో ఎకరం వరిపంటకు రూ.30వేల ఆదాయం రానుంది. రెండు పంటలకు కలిపి రూ.60వేల ఆదాయం వస్తుంది.

– నామాల సురేందర్, రైతు, మొసంగి

యాసంగిలో పెరగనున్న వరిసాగు



గత యాసంగి సీజన్‌లో కేవలం ఎనిమిది వేల ఎకరాల్లో వరిసాగు జరిగితే ఈ ఏడు 16వేల ఎకరాలకు పైగా వరిసాగు జరగనున్నట్లు అంచనా వేశాం. ఇప్పటి వరకు 8వేల ఎకరాల్లో వరినాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం ముమ్మరంగా నాట్ల పనులు సాగుతున్నాయి. ఈ నెలాఖారు వరకు 16వేల ఎకరాలలో వరినాట్లు జరగనున్నాయి. గత వానాకాలంలో 12వేల ఎకరాల్లో వరిసాగు జరిగితే ఈ యాసంగిలో అంతకుమించి సాగు జరగనుంది.

– కంచర్ల మాధవరెడ్డి, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

జనార్దనశర్మ సేవలు చిరస్మరణీయం


జనార్దనశర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాత్రికేయులు, నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : జర్నలిజానికి నందిబట్ల జనార్దనశర్మ చేసిన సేవలు చిరస్మరణీయమని సీనియర్ పాత్రికేయుడు హమీద్, టీపీసీసీ నాయకులు పగిడి రామలింగయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన జనార్దనశర్మ ప్రథమ వర్ధంతిలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాట్లాడారు. కార్యక్రమంలో పాత్రికేయులు ఎండీ.అస్లాం, కిలిమెల నాగయ్య, నాజీం, అన్నెబోయిన మట్టయ్య, మనోజ్‌కుమార్, అయ్యూబ్, నామిరెడ్డి నరేందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, జయరాజ్, నాగారాజు, తెలంగాణ ఉద్యమ నాయకులు అంబటి నాగయ్య, డేగ వీటి, హరి, హనుమయ్య పాల్గొన్నారు.

సైదమ్మ కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పాండురంగారెడ్డి

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన పుట్టల సైదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి మృతురాలు ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎడవల్లి దిలీప్‌రెడ్డి, నాగెండ్ల కృష్ణారెడ్డి, కొప్పు సోమయ్య, సింగ్ శంకర్, గుండు శ్రీను, తాడబోయిన శ్రీను, పిచ్చయ్య, వినోద్, శంకర్, కోటేష్, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్ కరీం తదితరులు ఉన్నారు.

కారు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


తీవ్రంగా గాయపడిన ముత్తయ్య

పెద్దవూర : కారు అదుపు తప్పి మీదకు దూసుకెళ్లడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం సాయంత్రం మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి ప్రకాశం జిల్లాకు వెళ్తున్న కారు మండలంలోని తుమ్మచెట్టుస్టేజీ వద్దకు రాగానే వేగంగా వస్తూ అదుపు తప్పి జనాలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రోడ్డు పక్కన స్కూటీపై కూర్చుని ఉన్న అనుముల మండలం చిలకాపురం గ్రామానికి చెందిన ముత్తయ్యను వేగంగా ఢీకొట్టుకుంటూ కొంతదూరంలో మాట్లాడుకుంటున్న మోతీలాల్, మత్రులను సైతం ఢీ కొట్టింది. దీంతో ముత్తయ్యకు తీవ్రగాయాలు కాగా, మత్రు, మోతీలాల్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం 108వాహనంలో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముత్తయ్యను అక్కడి నుంచి నల్లగొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత


సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్‌ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి : మండలంలో పలువురు పోగొట్టుకున్న ఐదు సెల్‌ఫోన్లను రికవరీ చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రామ్మూర్తి గురువారం బాధితులకు అందజేశారు. మండలంలోని గుమ్మడవెల్లికి చెందిన ఆదిరాల ఈదయ్య, కొండమల్లేపల్లికి చెందిన మారపల్లి యాదయ్య, పాక రామకృష్ణ, చెన్నారం గ్రామానికి చెందిన రమావత్ అంజయ్య, చింతపల్లికి చెందిన భీమనోని ఈదయ్య తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. వారు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వాటిని రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూలకంటి రంగారెడ్డి పరామర్శ

పాలకవీడు : మండల కేంద్రానికి చెందిన సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ మీసాల కాశయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం కాశయ్య కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర క్యావర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి పరామర్శించారు. కాశయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన అనంత ప్రకాశ్, నగేష్, ధనమూర్తి, మల్లారెడ్డి, రాంరెడ్డి, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చులతో రహదారికి మరమ్మతులు


రహదారిపై ఏర్పడిన గుంతల్లో మట్టిపోయిస్తున్న పాదూరి కిరణ్‌రెడ్డి

వేములపల్లి : మండల కేంద్రం నుంచి బీమారం మీదుగా సూర్యాపేట వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఈ రహదారిలో వాహనదారులు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు స్పందించిన మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పాదూరి కిరణ్‌రెడ్డి గురువారం తన సొంత ఖర్చులతో గుంతలను పూడ్చివేయించారు. సంక్రాంతి పండుగ రోజు తన స్నేహితుడు పోరెడ్డి వెంకటరమణారెడ్డి రోడ్డుపై ఉన్న గుంతలతో ప్రమాదం జరిగి మృతి చెందడంతో గుంతల్లో మట్టిపోయించారు. శెట్టిపాలెం నుంచి మొల్కపట్నం వరకు ఉన్న గుంతలను పూర్తిగా పూడ్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణ సమయంలో కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేయకుండా వదిలేయడంతో గుంతలు పడి తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై ప్రతిరోజు పలు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డులో పూర్తిగా బీటీ వేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కొలిపాక నాగేందర్, బొమ్మగాని సురేష్, బొమ్మగాని వెంకటరమణ, నరేష్, సతీష్, యాదగిరి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

త్రిపురారం : రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 25నుంచి 28వరకు సంగారెడ్డిలో జరిగే పార్టీ 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలతో కలిసి గడపగడపకు ప్రచారం నిర్వహించి మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంలా మారిందని విమర్శించారు. విద్య, వైద్యం ఉపాధి అందరికి అందుబాటులోకి రావడం, గ్రామాలు, పట్టణాలలో మౌలిక వసతుల సాధన కోసం రాష్ట్ర మహాసభల్లో పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి దైద శ్రీను, బెక్కం ఈదయ్య, దైద జానకమ్మ, వల్లపు సోమయ్య, ఎస్‌కే జానీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొండమల్లేపల్లి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో వెంటనే అమలు చేయాలని ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారుపాక గోపాల్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకూరి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు – వేల గొంతుల దండోరా సాంస్కృతిక మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 18న నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బహుజన యుద్ధనౌక లక్ష డప్పుల వేల గొంతుల సాంస్కృతిక నిర్వహణ అధ్యక్షుడు ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో మొదలైన సాంస్కృతిక కళా నేతల ప్రచారం రథయాత్ర నియోజకవర్గంలోని 8 మండలాలలో సాగుతున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఈదుల ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్ల శ్రీకాంత్ జాంభవ్, జిల్లా ప్రచార కార్యదర్శి ఆదిరాల రమేష్, నాగరాజు, పెర్వాల వెంకటయ్య, సైదులు, పంది శ్రీను, గడ్డం రమేష్ తదితరులున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు


బహుమతులు అందజేస్తున్న నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి

నల్లగొండ: ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని చిన్న సూరారం గ్రామంలో గురువారం కేటీఆర్ కప్ కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు షీల్డ్, నగదు బహుమతులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు విజయవంతంగా నిర్వహించినందుకు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.వి.ఆర్ సతీష్‌ని అభినందించారు. విజేతగా నిలిచిన హాలియా జట్టుకు మొదటి బహుమతిగా షీల్డ్, రూ.25,000 వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన చిన్న సూరారం జట్టుకు షీల్డ్, రూ.12 వేల నగదు, 3వ స్థానంలో నిలిచిన జాజిరెడ్డిగూడెం జట్టుకు షీల్డ్, రూ.7వేల నగదును మోహన్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, సంకు ధనలక్ష్మి, గాలి నాగరాజు, బెజవాడ సైదులు, బొడ్డుపల్లి రాజేష్, గోయల్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


మిర్యాలగూడ : ఆలగడపలో రైతుల భూములను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్


కొండమల్లేపల్లి : సర్వేను పరిశీలిస్తున్న దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి

కొండమల్లేపల్లి : వ్యవసాయ యోగ్యం కాని భూముల సర్వేను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం మండలంలో రైతులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం రెవెన్యూ, వ్యవసాయాధికారులు చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. మొదటి రోజు మండలంలోని దోనియాల, చెన్నంనేనిపల్లి, చెన్నారం గ్రామపంచాయతీలలో సర్వే తనిఖీ చేసి ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సర్వేలో మండల వ్యవసాయ శాఖ అధికారి జానకిరాములు, ఆర్ఐ శ్యాంసుందర్‌రెడ్డి, ఓర్సు శ్రీనివాస్, ఏఈఓలు సురేష్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులున్నారు.

రైతుల భూములు పరిశీలన

మిర్యాలగూడ : మండలంలోని ఆలగడప, అన్నారం గ్రామాల్లో రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందే రైతుల భూములను అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలగడప గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయేతర భూములను గుర్తించగా వాటితో లబ్ధి కలుగకుండా తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా పథకంలో భాగంగా లబ్ధిదారులను ఎంపిక కోసం గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని తహసీల్దార్ హరిబాబు అన్నారు. గురువారం ఆయన రెవెన్యూ, వ్యవసాయాధికారులతో కలిసి మండలంలోని జప్తీవీరప్పగూడెం, ఆలగడప, హైదలాపురం, తడకమళ్ల, తక్కెళ్లపాడు, గూడూరు, కిష్టాపురం, నందిపాడు గ్రామాల్లో పర్యటించి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీం సభ్యులు గ్రామాల్లో పర్యటించి పకడ్బందీగా సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాలు వర్తింపజేసేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ దేవ్‌సింగ్, ఏఓ సైదానాయక్, ఏఈఓలు షఫి, రమ్య, ఆఫ్రీన్, రమేష్, ఆర్ఐలు రామకృష్ణ, సత్యనారాయణ, మృదుల తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడ : సర్వే చేస్తున్న ఏఓ సైదానాయక్

నేత్రదానం

రామగిరి(నల్లగొండ): లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ ఛారిటబుల్ ట్రస్ట్, ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో మృతి చెందిన ముగ్గురు నుంచి గురువారం నేత్రాలను సేకరించారు. నల్లగొండ పట్టణం రవీంద్రనగర్‌కు చెందిన కంకణాల శోభారాణి(58), రామ్‌నగర్‌కు చెందిన కర్నాటి వెంకటేశ్వర్లు(49), హైదరాబాద్ ముసరంబాగ్‌కు చెందిన ఇమ్మడి కృష్ణవేణి (72)ల నుంచి కార్నియా సేకరించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, డాక్టర్ హరినాథ్, డాక్టర్ పుల్లారావు, జానీ, చిలుకూరి రామకృష్ణ పాల్గొన్నారు.

మట్టపల్లిలో అర్చకుల క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆలయ ప్రధాన అర్చకులు


క్రికెట్ ఆడుతున్న అర్చకులు

మఠంపల్లి : ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పరిధిలో గల ఎస్‌సీఎల్ స్కూల్ గ్రౌండ్‌లో తెలుగు రాష్ట్రాల స్థాయి తెలంగాణ వైఖానస ప్రీమియర్ లీగ్ టీ–10 క్రికెట్ పోటీలను గురువారం మట్టపల్లి ఆలయ ప్రధాన అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ పోటీలలో హైదరాబాద్, ఖమ్మం, తిరుపతి, మట్టపల్లి, కోదాడ, హుజూర్‌నగర్‌లకు చెందిన అర్చకులు ఆరు జట్లుగా లీగ్ పద్ధతిలో మూడురోజుల పాటు పోటీలలో తలపడనున్నాయని తెలిపారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. లీగ్ పద్ధతిలో ఒక్కొక్క జట్టు మిగిలిన ఐదు జట్లతో తలపడాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, మొదటిరోజు తొలి మ్యాచ్‌లో గౌతమస్ అండ్ భృగువారియర్స్ జట్లు తలపడగా గౌతమస్ జట్టు విజయం సాధించింది. రెండవ రౌండ్‌లో హంటర్స్ అండ్ ద్వారకా వారియర్స్ పోటీపడగా ద్వారకా వారియర్స్ గెలుపొందారు. మూడవ రౌండ్‌లో విఖనస రైజర్స్ అండ్ భృగు వారియర్స్ తలపడగా విఖనస వారియర్స్ విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో బొర్రా వెంకటవాసుదేవాచార్యులు, తూమాటి రామాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, విఖనస ప్రీమియర్ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మారనున్న తిప్పర్తి రూపురేఖలు

- రూ.9 కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు
- మార్చి నెలాఖరు వరకు పూర్తి చేయడమే లక్ష్యం

తిప్పర్తి : ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకుండా ఉన్న తిప్పర్తి మండల కేంద్రం రూపురేఖలు మారనున్నాయి. రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్, ఇతర సుందరీకణ పనులతో తిప్పర్తికి మహర్దశ పట్టనుంది. తిప్పర్తి మండల కేంద్రంలో అభివృద్ధి పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గత సంవత్సరం ఆగస్టు నెలలో రూ.9 కోట్ల నిధులతో ప్రారంభించారు. అయితే అద్దంకి–నార్కట్‌పల్లి రోడ్డుపై తిప్పర్తి మండల కేంద్రం ఉండడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉండడం వల్ల పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం తిప్పర్తిలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. బైపాస్‌లో వాహనాలను అనుమతిస్తుండడంతో తిప్పర్తి మండల కేంద్రంతో ట్రాఫిక్ తగ్గింది. దీంతో ఎట్టకేలకు సుందరీకణ పనులు ప్రారంభించారు.


తిప్పర్తిలో ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

సెంట్రల్ లైటింగ్, డివైడర్..

తిప్పర్తి మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న డబుల్ రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించనున్నారు. తిప్పర్తి సెంటర్‌లో బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. నకిరేకల్, నల్లగొండ, మిర్యాలగూడెం వైపు వెళ్లే బీటీ రోడ్లను సీసీగా మార్చనున్నారు. సెంట్రల్ లైటింగ్, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా సైడ్ డ్రైన్ ఏర్పాటు చేయడం, విద్యుత్ స్తంభాలను మార్చడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయనున్నారు. బైపాస్ ప్రారంభం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సెంట్రల్ లైటింగ్, మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులన్నీ మార్చి నెల చివరి నాటికి పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనులు కూడా ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి.

గతంలో వాహనాల రద్దీ ఉండేది



గతంలో రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం రోడ్డు విస్తరణ చేపట్టడంతో రో డ్డు విశాలంగా మారింది. ప్ర యాణికులకు, వాహనదారులకు తిప్పలు తప్పాయి. వీటితోపాటు రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టనున్నారు.

– వెంకన్న, తిప్పర్తి

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలి



తిప్పర్తి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు చేయడం బాగుంది. కానీ వాహనదారులకు, మహిళలకు ఇబ్బందులు లేకుండా సులభ్ కాంప్లెక్స్ కూడా ఏర్పాటు చేయాలి. సులభ్ కాంప్లెక్స్ లేక మహిళలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

–జాకటి ఆనంద్, తిప్పర్తి

మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేస్తాం

తిప్పర్తి మండల కేంద్రంలో రూ.9కోట్ల నిధులతో రోడ్డు విస్తరణ, సుందరీకరణ పనులు ప్రారంభించాం. ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మార్చి నెల చివరి నాటికి పనులు పూర్తి చేస్తాం.

–గౌస్ పాషా, ఆర్అండ్‌బీ ఏఈ

అలీమ్‌కు డాక్టరేట్



నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణానికి చెందిన ఎం.ఎ అలీమ్ పీహెచ్‌డీ పూర్తి చేసి తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. దక్షిణ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పురుషుల ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆట నైపుణ్యాన్ని ప్రభావితం చేసే శారీరక, శరీర అభ్యంతర, శారీరక శక్తి అంశాలను విశ్లేషించి ప్రదర్శన అంచనా వేశారు. ఈ పరిశోధనకు గైడ్‌గా డాక్టర్ ఎం.మరిముట్టు వ్యవహరించారు. అలీమ్ పరిశోధన ఫుట్‌బాల్ క్రీడాకారుల ప్రదర్శన మెరుగుపర్చడానికి మార్గదర్శకంగా నిలుస్తుందని యూనివర్సిటీ వెల్లడించింది.

ఏజీపీ కిషన్‌నాయక్‌కు సన్మానం

మఠంపల్లి : హైకోర్టు ఏజీపీ, మండలంలోని పాతదొనబండతండాకు చెందిన భూక్యా కిషన్‌నాయక్‌కు హోం అండ్ పోలీస్ సర్వీసెస్‌లో పదోన్నతి లభించిన సందర్భంగా గురువారం స్థానికంగా కాంగ్రెస్ పార్టీ మండల ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, డీసీసీ ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు నవీన్‌నాయక్, టీపీసీసీ అధికార ప్రతినిధి బానోతు భాస్కర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ పెదవీడు గ్రామ అధ్యక్షుడు షేక్ ఖరీమ్, నాగచైతన్య, సుమన్, నాగరాజు, శివ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ: యువజన కాంగ్రెస్‌లో మంచి వక్త అయితే కాంగ్రెస్‌లో నాయకుడిగా ఎదిగేందుకు అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో యంగ్ ఇండియాకే బోల్ సీజన్–5 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్‌రెడ్డి, తిరుగుడు రవి యాదవ్, షేక్ జహంగీర్ బాబా, జాల మణికంఠ స్వామి, వల్కి దిలీప్, అబ్బనబోయిన రాము యాదవ్, ఏనుగు రఘుమారెడ్డి, కిన్నెర హరికృష్ణ, మల్‌రెడ్డి భానుచందర్‌రెడ్డి, గాలి నాగరాజు, ఎండీ అజారుద్దీన్, మంచి కంటి సిద్ధార్థ, కట్టంగూరు ఆనంద్, దాసరి విజయ్, ఆవుల నందిని శ్రీనివాస్ పాల్గొన్నారు.